"బిందూ!"

.... .... ....

"తల్లీ బిందూ!"

మెల్లిగా భారంగా కళ్ళెత్తింది హిమబిందు. ఆ కళ్ళలో కోటి ఆవేదనలు, కళ్ళక్రింద విశ్రాంతిగా అనుభవించిన అశాంతి తాలూకు వల్లటి గుర్తులు.

# ఆరో ఋతువు

## డాక్టర్ పెళ్ళకూరు జయప్రద

ఆమెకు తెలుసు తనెవరింటికి వెళ్ళి వస్తున్నదీ. అయినా తెలిసే ఎందుకు అడుగుతున్నట్టు? ఆశ్చర్యపోతూనే జవాబు చెప్పాడు.

"మీ సాయి బాబాయి యింటికి వెళ్ళొస్తున్నాను."

ఆమె నవ్వింది. ఆ నవ్వులో కొంత ఆవేదన. మరి కొంత విమర్శ—

"పెద్దమామయ్యా! మరి.... పావని ఇంటికి ఎందుకు రాలేదారోజు నువ్వు."


"ఎప్పుడమ్మా?"

నిజానికి ఆ ప్రశ్న చచ్చు ప్రశ్న. పావని ఎవరో తనకు తెలుసు. ఎప్పుడు పావని తనని పిలిచిందో. తనకి తెలుసు అయినా తనా ప్రశ్న ఎందుకు వేశాడు?.... తను. తన చెల్లెలు

మళ్ళీ కళ్ళు మూసుకుంది— హిమబిందు! తన చేతుల్లో పెరిగి, తన గుండెలమీద ఆడి విపరీతమైన జిజ్ఞాసతో తనని ఊపిరి సలపని ప్రశ్నలు వేసి ఆశ్చర్య చకితుణ్ణి చేసిన పాతికేళ్ళ బిందు తల్లి ఇప్పుడు డిప్రెషన్ అనే వ్యాధితో అదే ప్రపంచంలో తనని విపరీతమైన ఆవేదనలో ముంచుతూ మళ్ళీ కళ్ళు మూసుకుంది

"బిందూ పళ్ళరసం త్రాగుతావా?"

వద్దన్నట్టు తల అడ్డంగావూపింది. అసలు ఏదైనా తినడం, త్రాగడం అనేది చాలా భయంకరమైన విషయంగా అనిపిస్తోందా



పిల్లకు- ప్రశ్నలు వేసి వేసి ఏ జవాబుతోనూ తను తృప్తిపడలేక అలాంటి జీవితంతో రాజీ పడలేక అందరి సమస్యలను తన సమస్యలుగా అందరి మోసాల్ని తన మోసాలుగా భావించి యీ దశకు చేరింది.

అందరి గురించి ఎందుకమ్మా ఆలోచిస్తావు. నీ కొడుకుని ఈ లోకానికి వారసుణ్ణి చేయకుండా పెంచుకోరాదా? అంటే విరక్తిగా నవ్వేది.

"ఈ ప్రపంచంలో బ్రతికేది నా కొడుకొక్కడే కాదుగా మామయ్యా" అని.

"అందరి బాధల్ని, అందరి ఆవేదనల్ని, అందరి మోసాల్ని చిన్నారి తల్లీ నీ భుజస్కందాల మీద ఎందుకు మోస్తావు నువ్వు" నిట్టూర్చాడా వృద్ధుడు.

హిమబిందు నీరసంగా తలెత్తింది.

"ఎవరింటికి మామయ్యా వెళ్ళొస్తున్నావు?" నీరసంగా చూస్తూ అంది.

కూతురు దగ్గర ఆమె వ్యక్తిత్వం ముందు భయపడ్తాడు. ఆ భయం, ఆమె వ్యక్తిత్వం పట్ల గౌరవం. తను అలాటి చచ్చు ప్రశ్న వేసేలా చేసింది. ఆమెకు జవాబివ్వడానికి తనకు కొంత వ్యవధి కావాలి మరి.

"అదే మామయ్యా! ఆ పిల్ల రిసెప్షన్‌కి."

"ఆఁ ఆ -" గుర్తొచ్చినట్టుగా నటిం

చాడు-ఆ విషయాన్ని అతనెప్పుడూ మర్చిపోడు గనుక.

ఆ రోజు తన తమ్ముడు కూతురు ఓ సాహసం చేసింది. చాలా పేదవాడిని. యీ సాంఘిక పరిధుల దృష్ట్యా అట్టడుగు మనిషి చేయి పట్టుకుని పదడుగులు నడచి జీవితంలో అతని గుండెల్లో మొకటి వ్యక్తిగా అతనితో వెళ్ళిపోయింది. పరాయివాళ్ళు ఆ పనికి హర్షిస్తే అయినవాళ్ళు గర్హించారు. తమ కుటుంబ సభ్యుల్లో ఆ అమ్మాయి ప్రీతిగా పిల్చి ఇచ్చిన రిసెప్షన్‌కి వెళ్ళిన ఒకే ఒక వ్యక్తి హిమబిందు.

ఆమె వెళ్తూవెళ్తూ తన స్నేహితుడైన తనతో అంది "పెద్దమామయ్యా! నా వెనక నువ్వూ వస్తావనుకుంటాను."

తను జవాబివ్వలేదు. తనమీద ఎంత భరోసానో తన జవాబు వినకుండానే వెళ్ళిపోయింది.

కానీ తనమేనమామ గుండె వైశాల్యం మీద ఆ పిల్ల పెంచుకున్న నమ్మకం చెదిరిపోయింది కాబోలు. చెదిరిపోయిన కాటుక కంటితోవచ్చి నిలదీసింది.

"నువ్వు ఎందుకు రాలేదు?"

ఆ పిల్ల తీక్షణమైన చూపులకు ఆనాడూ తట్టుకోలేకపోయాడు. ఈనాడూ తట్టుకోలేకపోతున్నాడు.-నీరసించి లోతుకుపోయిన ఆ కనుపాపల్లో కూడా ఎంత తీక్షణత.

ఆ రోజు తనకంటె ఓతరం చిన్నదయిన తన చెల్లెలి కూతురు వంక సూటిగా చూడలేక తలవంచుకుని గిల్టీగా అన్నాడు-

"మీ చిన్నమామయ్య బాధపడ్తాడు కదమ్మా"

"నా ప్రశ్నకు జవాబు నీదగ్గర నుంచి అదికాదు మామయ్యా నేను కోరుకునేది"

తను మాట్లాడలేదు.

"పోనీ ఈ ప్రశ్నకు జవాబు చెప్పు పావని తప్పు చేసిందా?"

"…. …. …."

"అంటే మౌనంగా వున్నావంటే నీకూ, అనిపిస్తోందన్న మాట - ఆ పిల్ల తప్పు చేసిందని" ఆమె గొంతులో తన అంచనా దెబ్బతిన్న భావం.

ఆ పిల్ల కళ్ళల్లో కనపడ్డ ఓటమి భావానికి బెదిరిపోయాడు - తనీ జన్మలో తన హిమబిందుని బాధపెట్టగలడా?

"పావని తప్పు చేసిందని నేనన్నానా తల్లీ"

"అయితే…."

"కుటుంబం తలెత్తుకోవద్దామ్మా".

నిజానికి తనకా భావం లేదు. ఆ పిల్ల ఇష్టపడ్డ పిల్లాడిని పెళ్ళి చేసుకుంటే కుటుంబానికేమొచ్చింది? కానీ ఏదో జవాబు చెప్పాలి….అనే భావంతో పాయసంలో పడ్డ ఈగలా తయారయ్యాడు.

"కుటుంబం పరువుపోయిందా? సరే ఒప్పుకుంటాను. అయితే ఆ పిల్లను వెలేస్తే మీ కుటుంబం పరువు ఇంకా పోతుందనుకుంటానే కానీ. ఎక్కువవుతుందనుకోను".

తను జవాబు చెప్పకముందే బిందు మరలా అందుకుంది. "పావనిని ఇంట్లోకి రానీకుండా ఎగ్జిబిషన్‌లో బొమ్మలా బయట పెట్టి ప్రజలకు మీరు మంచిటాపిక్ ఇచ్చారు. పావని మనమధ్యే వుండుంటే నోరెత్తడానికి ఎవరూ సాహసించి వుండేవాళ్ళుకాదు. ఏమో! నాకలా అనిపిస్తోంది మామయ్యా".

తను మామూలు ప్రకారం తన చిన్నారి తల్లి వాదనకు ముగ్ధుడయ్యాడు— పదేళ్ళ హిమబిందుకూడా తనని వాదించి ఓడించేది- ఈ రోజో లెఖ్ఖా!

"ఏవిటి మామయ్యా మాట్లాడవు?"

"పావనిదగ్గరకెళ్ళకపోవడానికి, సాయిబాబాయి దగ్గరకెళ్ళడానికి ఏవిటి సంబంధమమ్మా?"

ఆమె నీరసపు కనుపాపల్లో కోపపు ఛాయలు-వెంటనే అందులో నిస్పృహ.

"పావని తప్పుచేసిందని అనాడు వెలేశారుగా మీరంతా".

అవుననన్నట్లు తలూపి కొద్దిగా కళ్ళు వాల్చుకున్నాడు.

"పావని తప్పుచేసుంటే అంతకు పదిం



తలు తప్పు సాయిబాబాయి చేశాడు. అతనెందుకు వెలివెయ్యలేదు మీరు".

స్థాయిపెంచిన ఆమె కంఠం కీచుగా పలికింది.

తలెత్తి అర్థంకానట్టుగా చూశాడతను.

"సాయిబాబాయి చేసిన పని నీకు తప్పుగా అన్పించలేదా మామయ్యా"ఆ పిల్లగొంతులో కొంత నిస్సహాయత. కొంతరోషం.

సాయి చేసింది తప్పే చెల్లెలిఆస్తి ల్యాండ్ సీలింగ్‌లో పోతుందని తన పేరన వేస్తే దాన్ని స్వంతం చేసుకున్నాడు. చాలా ఘోరమైన నేరమే.

"మాట్లాడు మామయ్యా"

"ఏం మాట్లాడను బిందూ.అయినా అవన్నీ నీ కెందుకు? కాసేపు పడుకోరాదూ "

పడుకుంటాలే మామయ్యా. మొదట సాయి బాబాయ్ గురించి నీ గుండెల్లో వుండేది బయటపెట్టు".

"అతను చేసిందీ తప్పేనమ్మా" రెండు నిముషాల నిశ్శబ్దం తర్వాత అన్నాడు.

"అయితే అతనెందుకు వెలివెయ్యలేదు. వాళ్ళింటి కెందుకెళ్ళావ్" తీక్షణంగా చూస్తోంది"రెండేళ్ళు గడిచిపోయినా పావని సుఖంగావున్నా పావనినింకా ఎందుకు మీలోకి రానీలేదు?"

ఆమె గుండెల్లో రగిలే మంటల్లోనుంచి కొంత శక్తిని పెంచుకుని మెల్లిగా లేచి దిండు కానుకుని కూర్చుంది.

"పావని పెద్దవాళ్ళ మాట కాదని వెళ్ళిపోయింది కదమ్మా".

చురుగ్గా చూసింది హిమబిందు.

"అయితే.... పావని సుఖపడ్తున్నా. పావని శాంతిగా బ్రతుకుతున్నా. మీకానందంగా పశ్చాత్తాపంగా లేదన్నమాట. మీ మాట కాదన్నది కనుక ఆ పిల్ల ఇంటికి మీరు వెళ్ళరన్న మాట. ఎంత స్వార్థం మామయ్యా."

ఆ పిల్ల గొంతుక నీరసంతో కీచుపోతున్నా ఆమె కళ్ళల్లో మాత్రం విపరీతమైన భావ సంపద.

"అది కాదురా" అని ఏదో చెప్పబోతున్న అతన్ని వారించింది.

తను కూడా ఈ పెద్దవాళ్ళ దురాగతాలను అంతర్గతంగా సమర్థించడం లేదు కానీ వాళ్ళ మోసాలకు తన చెల్లెలి కూతురు మనోవ్యధ తెచ్చుకుంటుంటే ఆ పిల్లను అందులో నుంచి లాగే ఉద్దేశంతో వాళ్ళను సమర్థిస్తూ మరింత తప్పు చేస్తున్నాడతను.

"ఆ రోజయితే ఆ డబ్బులేని అబ్బాయితో, కులం లేని వాళ్ళతో అడ్జస్ట్ అవలేదని మీరంతా వారించి వుండవచ్చు. మీ ఇంటికి రానివ్వమని హెచ్చరించి ఉండచ్చు. కానీ ఈ రోజు వాళ్ళందరిలో ఒకటపోయి సలక్షణంగా సంసారం చేసుకుంటోందామె. అయినా మీ పట్టుదలలు పోలేదంటే మామయ్యా! మీరంటేనే నా కసహ్యం వేస్తోంది. మీ బిడ్డ సుఖం కంటే మీ మాట ముఖ్యమనుకునే మీ అందరికీ వారసురాలినైన నేనంటే. నా జీవితమంటే రోతపుడ్తోంది."

నీరసంగా పడక మీద వాలిపోయిందామె

"బిందూ; బిందూ! అలా అనకమ్మా వీళ్ళ గుండెల్లో ఆడిపిల్ల మీద ఎంత ప్రేమ."

"ప్రేమా?........" నవ్వింది నీరసంగా, వ్యంగ్యంగా.

"ప్రేమంటే ఇదా మామయ్యా?"

"ప్రేమంటే నా ఉద్దేశమమ్మా...."

"వద్దు మామయ్యా చెప్పొద్దు. ప్రేమంటే ఇదే అయితే.... మీరందరూ నామీద చూపిస్తున్న ప్రేమ కూడా ఇదే? కదూ! నేను మీ మాట వినకపోతే నన్ను వెలివేస్తారు కదూ!"

"అవేం మాటలమ్మా?"

"పావని-ఏ కారణంచేతయినా వాళ్ళతో అడ్జస్ట్ కాలేక వాళ్ళను వదిలేసి మీ కాళ్ళను చుట్టుకొనుంటే మీరప్పుడు ఆ పిల్లను ఆనందంగా అక్కున చేర్చుకుని ఆదరించి వుందురేమో ! కదూ మామయ్యా"

"ఇక్కడ వృద్ధుడు ఆలోచనల్లో పడ్డాడు. అతనిమేధస్సుకు అందిన సత్యం అతన్ని విచలితుణ్ణి చేసింది. నిజమే-ఆపిల్ల అతన్ని వదిలేసి వచ్చుంటే వీళ్ళందరూ ఆ పిల్లమీద సానుభూతి చూపి ఒడిలో దాచుకోనుండే వాళ్ళు— యీ సమాజంలో ఆ పిల్లకు రెండో పెళ్ళి అంత సులువైన విషయం కాదు కనక ఆపిల్ల ఒంటరిగామిగిలిపోయినా ఆ పిల్ల కన్నీళ్ళను వీళ్ళు పంచుకుంటూ సహజీవనం చేసుండేవాళ్ళు'.

నిట్టూర్చాడతను.

"ఈ మనస్తత్వానికి ఏపేరు పెట్టాలి మామయ్యా?"

అతని మనసులో కదిలిన భావాన్ని ప్రశ్నరూపంలో వదిలిందామె—

అతను మాట్లాడలేదు.

తన మేనమామను కొంతవరకు అర్థం చేసుకుంది హిమబిందు. అతనూ ఈ పెద్ద మనుష్యుల్ని మానసికంగా సమర్థించడం లేదు. అయినా వాళ్ళను సమర్థిస్తున్నట్టు నటిస్తున్నాడు. ఎందుకని? వ్యక్తిత్వంలేకా? పర్దుబాటు మనస్తత్వంతోనా?లేక తనకంటూ భార్యాబిడ్డలులేకా?


ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది హిమబిందు. సాయిబాబాయ్ గురించి. పావని గురించి క్షణం మర్చిపోయి తన తల్లి పెద్దన్న మనస్తత్వంలోకొచ్చి పడిందామె.

పెద్దమామయ్య వాళ్ళనెందు కనుసరించాలి? అసలు వాళ్ళ ద్వారా ఏం సుఖపడ్డాడు కనక?

మూసుకున్న ఆమె కనురెప్పల వెనగ్గ అసహనంగా కదులుతున్న కనుపాపలు.

మామయ్య పెళ్ళి చేసుకునుండాల్సింది.

బ్రహ్మచారిగా మిగిలిపోయిన అతను ఎవరితో బాగున్నా మరొకరు చూడలేరు. ఆ బాగున్న వాళ్ళకి ఆస్తి ఇచ్చేస్తాదని భయం అందరిమరాళ్ళల మధ్య అతనికి పాపం నిజమైన స్నేహితులే లేరు. ఆరోజు మామయ్య డయబెటిక్ కోమాలో వెళ్ళినప్పుడు అతని చుట్టూకావ్ని వదులమంది. అందరి గుండెల్లోనూ అతను బ్రతకాలనే కోరిక గాఢంగా. అతి గాఢంగా కానీ ఆ కోరిక అతను బ్రతికి కనులువిప్పి తమలో ఒకడుగా మారాలని కాదు. అతను తన



ఆ స్త్రీని ఎవరికి వ్రాశాడో. అసలు వ్రాశాడో లేదో తెలీక.

ఎంత ఘోరం— ఎంత రాక్షసత్వం!! విపరీతమైన వేదనతో ఇక కళ్ళుమూసుకో లేక తెరిచిందామె.

"ఏం రా! బలహీనంగా వుందా?"

"పెద్ద మామయ్యా!" అతన్ని అల్లుకు పోయి వెక్కి-వెక్కి ఏడ్చింది.

తనకంటూ జీవితంలేని ఆ వృద్ధుడు తన దని అనుకున్న హిమబిందు వెన్ను సవరిస్తూ నిస్సహాయంగా నిల్చిపోయాడు.

ఆ వృద్ధుడి గుండెల్లో తల దూర్చి వేదన తీర్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఆమె శరీరమంతా ఏవో మంటలు శరీరం లోపంతో చీకటిలాంటి భావం. ఏదో పోగొట్టుకున్నట్టు. ఏదో చేయాల్సి చేయలేకపోయినట్టు తనకే అర్థంకాని భావపరంపరలు - మనసు విదిల్చుకున్నా వెంటాడే సందేహాలు.

అసలు సాయిబాబాయి ఎందుకలా చేసినట్టు? చెల్లెలూ తన రక్తమే. తన బిడ్డలూ తన రక్తమే. ఒకరక్తాన్ని మోసంచేసిమరో రక్తానికందించే ఉద్దేశం అసలెందుకొస్తుంది? తనయితే జీవితాంతం ఎంత తపస్సుచేసినా ఆ పని చేయగలదా?

"పెద్దమావయ్యా! సాయిబాబాయ్ చెల్లెలి ఆస్తికొట్టేసి తన పిల్లల కిస్తున్నాడు. రేపొద్దున వాళ్ళు అతన్ని నిర్లక్ష్యంచేస్తే అతనికి షాక్ రాదూ!"

తన కంట్రోల్ ని మించి వచ్చిన ఏడుపు ఆగాక చాలా సేపటికి అంది.

అతను ఓపదిహేనేళ్ళ ముందుకు వెళ్ళి అక్కడ ఓ క్షణం ఆగి ఆలోచించాడు.

"నిజమే. పిల్లలుఅతన్ని నిర్లక్ష్యం చేస్తే షాక్ సంగతి ఏమోగానీ కనీసం చెల్లెల్ని మోసం చేసినందుకైనా పశ్చాత్తాపపడ్తాడు.

అదే అన్నాడతను హిమబిందుతో.


పేలవంగా నవ్విందామె.

"నువ్వు ఊహించిందే నాకూ అనిపించింది మామయ్యా. కానీ దానివల్ల ప్రయోజనం ఏమిటి? అతను చరమ దశలో పడే పశ్చాత్తాపం....అదే అంతా అయి పోయాక పడే పశ్చాత్తాపం వల్ల ఏమిటి లాభం?—"

.... .... .... .... ....

"పోనీ ఇలాటి సాయిబాబాయ్ లను చూసి ఎదిగే చిరంజీవి సాయిలన్నా మారతారంటావా మామయ్యా.... ఊహుఁ మారరు. ఆ స్టేజి వాళ్ళు కొస్తేగాని పశ్చాత్తాప పడరు. ఇది నిరంతర స్రవంతికదూ పెద్ద మామయ్యా."

"ఏమో తల్లీ. అవన్నీ అసలు నేను






ఆలోచించను. నువ్వూ ఆలోచించకు" ఆమె పేలవంగా నవ్వింది.

"ఆలోచించొద్దా? తెలేవాడివే. అది నా చేతిలో వుందా?"

అతను మాట్లాడలేదు. ఆమె భావప్రవాహాన్ని ఎలా ఆపాలో ఆ వృద్ధుడికి తెలియడం లేదు.

"ఒకరి జీవితాల్లోనుంచి మరొకరు పాఠాలు నేర్చుకునేపనయితే ఇంతప్రశాంతి. ఇంత అభద్రత ఎందుకుంటోంది. మనలో దొంగతనాలు చేసి జైలుకెళ్ళేవాళ్ళు వెళ్తూనే వున్నారు దొంగతనాలు చేసేవాళ్ళు ఎక్కువ అవుతూనే వున్నారు. తాగేవాళ్ళు తాగి లివర్ పాడై చచ్చిపోయేవాళ్ళు చచ్చిపోతూనే వున్నారు. త్రాగే జనాభా ఏమీ తగ్గడమేలేదు. మోసాలుచేసి పశ్చాత్తాప పడేవాళ్ళు పశ్చాత్తాపపడ్తూనే వున్నారు. మోసాల సంఖ్య పెరిగిపోతూనే వుంది...."

"బిందూ."

"మామయ్యా! మొన్న ఏమయిందో తెలుసా? మా లలిత లేదూ తనూ, వాళ్ళమ్మ వాళ్ళ నాన్నకు హాస్పిటల్‌లో అన్నంపెట్టి రిక్షాలో తిరిగొస్తుంటే ఇద్దరు రిక్షా ఆపి ఎంత రేటయినా యిస్తాం ఆ అమ్మాయి కావాలని అడిగారట. ఎంత అహ్యం! ఇదీ భారతదేశం మామయ్యా"

"భారత దేశాన్నెందుకమ్మా అనడం? కలుపుమొక్కల్లా కొందరిలాంటివాళ్ళు...."

"లేదు మామయ్యా కలుపు మొక్కలుండకూడదు. అసలు మామయ్యా వీళ్ళు తన భార్యనో, తల్లినో చెల్లెనో ఎవరైనా ఇలా అడిగితే సహించగలరా? ఆ క్షణాన్ని ఒక్కసారి ఊహిస్తే- ఒళ్ళంతా జలదరించే ఆ దృశ్యాన్ని ఊహిస్తే ఇలా ఓ ఆడపిల్లని అడిగే నైచ్యానికి దిగజారగలరా?"

ఆమె కళ్ళు మూసుకుంది.

హఠాత్తుగా, మౌనంగా అలసిపోయి పడకమీద పొర్లుతున్న బిందు వంక జాలిగా చూశాడతను.

ఎలా? ఎలా? ఈ అమ్మాయిని మార్చడం? కిటికీ కవతలకు చూశాడు. ఎలక్షన్లకు కట్టిన కాగితాల తోరణాలు గాలికి రెపరెపలాడుతున్నాయి మెంటల్ హెల్త్ సెంటర్లో అడ్మిట్ అయి విపరీతమైన డిప్రెషన్‌లో వున్నప్పుడు ఓటు వేయాలని తన బలహీనతను జయించి ఓ రోజు పర్మిషన్ మీద డిశ్చార్జ్ చేయించుకుని వచ్చి తెలుగుదేశానికి ఓటు వేసి వెళ్ళింది పిచ్చితల్లి.

"ఎందుకమ్మా నీకాశ్రమ?" అంటే ....

శ్రమ ఏమిటి మామయ్యా. కొత్త ప్రభుత్వం వస్తే అయినా యీ అరాచకాలు తగ్గుతాయేమో! యీ రోజు వేసిన రోడ్డు రేపు రేగిపోకుండా మంచిరోడ్లు వెలుస్తాయేమో!

"పిచ్చితల్లీ! ప్రభుత్వం మారినంత మాత్రాన అన్నీ మారిపోతాయా?"

"ఏమో! మారొచ్చు. నాకు కొంత ఆశుంది. కాంట్రాక్టర్స్ మరీ దురాశకు పోతున్నారు కంట్రోల్ చేసే పైవాళ్ళులేక".


"పైవాళ్ళా! వాళ్ళు తినకపోతే చాలు. చిన్న కాంట్రాక్టర్లుకి పెద్దగా మిగలదమ్మా. అసిస్టెంట్ ఇంజనీర్‌కి త్రీపర్సెంట్. జూనియర్ ఇంజనీర్‌కి ఫైవ్ పర్సెంట్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కి టెన్‌పర్సెంట్. ఇంక మిగిలేదెంత వీళ్ళకి?

పైగా పోటీ జాస్తయినప్పుడు లెస్‌కు పాడుకుంటారు. దాంతో తనకు కొంత మిగుల్చుకోవడంతో రోడ్డుకేమీ మిగల్చడం లేదు వాళ్ళు."

"మామయ్యా- పోనీ వాళ్ళకు పర్సెంటేజ్ పెంచితే ఇంజనీర్లు చెయ్యి చాపకపోతే బాగా వేస్తారంటారా?"

"వేయొచ్చు. తమిళనాడులో రోడ్స్ బాగున్నాయి కదా!"

కాసేపు ఆలోచిస్తూ వుండిపోయింది బిందు.



"ఏమ్మా! ప్రభుత్వానికి రిప్రజెంట్ చేస్తావా?" నవ్వాడతను. ఆమె కూడా నవ్వింది. కానీ ఆమె గుండెలు నవ్వలేదని అతనికి తెలుసు.

ఆ రోజు హిమబిందు మనసు కదిలిస్తూ మరో సంఘటన జరిగింది. అది ఇంచుమించు రోజూ జరిగేదే. కానీ అది ఆమె దృష్టిలో చాలా నేరమయిపోయింది.

అది టు టైర్ కంపార్ట్‌మెంటు. మానసికంగా, శారీరకంగా బలహీనంగా వున్న బిందు కూర్చోవడానికి చాలా శక్తిని కూడదీసుకుంటోంది. కండక్టర్ చకింగ్ కొచ్చాడు.

"ఆరు రూపాయలివ్వండి."

తను విస్తుపోయాడు.

"సిట్టింగ్‌కి ఒక్క రూపాయే కదా!"

"పర్వాలేదు బర్త్ వాడుకోండి".

ఒక్క క్షణం ఆలోచించాడు. పది రూపాయలు బర్త్ మూడు రూపాయల కిస్తున్నాడు. ఆ మూడు రూపాయలు జేబిలో వేసుకుంటాడు. పోనీలే అతనూ బాగు పడ్తాడు. కూర్చోలేక అవస్థపడ్తోంది. బిందు కాసేపు నడుం వాలుస్తుంది. తనే బిందు కొరకు ఒకబర్త్ కావాలని అడగాలనుకుంటూ వున్నాడు.

ఆరు రూపాయలు కండక్టర్ చేతిలో పోసి వచ్చి ఆ ఘనకార్యం కాస్త చెల్లెలి కూతురికి చెప్పేశాడు.

తనకిప్పటికీ కన్పిస్తుంది. ఆరోజు బిందు తల్లి కళ్ళల్లో ఎఱ్ఱజీర.

"మీవల్లే మామయ్యా! వాళ్ళ తప్పేం లేదు. మీ వల్లే వాళ్ళు లంచగొండు లవుతున్నారు."

ఆరోజు ఎంత బ్రతిమిలాడినా పిచ్చితల్లి నడుం వాల్చనే లేదు. తను మాత్రం నాలుగు రూపాయలు నష్టపోయాడు.

ఉలిక్కిపడ్డాడతను.

రెపరెపలాడే ఎలక్షన్ల రంగు కాగితాల మీదనుంచి ఎంత వెనక్కు వెళ్ళాడతను!

ఇటు తిరిగిన అతనిలో సందేహం-

బిందు ప్రక్కలు ఎగరేస్తోంది. దిండులో తల పూర్తిగా దూర్చేసి విపరీతమైన మానసిక వేదనకు గురి అవుతున్న సూచనగా తలాడిస్తోంది.

"బిందూ!"

ఆ వృద్ధుడికి అర్థమయింది. మరలా బిందు డిప్రెషన్‌లోకి జారుకుంటోంది. ఆమెను బలవంతంగా తన ఒడిలోకి లాక్కున్నాడు. ఆమె వున్నట్టుండి బర్స్టుఅయింది.

ఆమె కన్నీళ్ళతో అతని పంచె తడిసిపోతూనే వుంది.

# ఔరా  నిజమేనా?

## ప్రేమించేవారికి చెప్పకూడని నిజాలు

ప్రేమికులుగా ఉంటూ పెళ్ళిచేసుకుందా మనుకుంటున్న వాళ్ళూ, పెళ్ళిచేసుకుని కూడా ప్రేమించుకుంటున్న వాళ్ళూ.(అలా ఎవరూ ఉండరనుకోండి) ఒకరితో ఒకరు అన్ని విషయాలూ చెప్పేసుకోవాలనీ. ఏవిషయమూ దాచకూడదనీ అంటారు.

కానీ కొన్ని సందర్భాలలో గాఢంగా ఒకరొక్కరు ప్రేమించుకునే వారు కూడా కొన్ని విషయాల్ని. ఆలోచనల్ని రెండో వారికి చెప్పకూడదు— ఒకవేళ చెప్పవలసి వచ్చినా నిజం చెప్పకూడదు— అందంగా అబద్ధం చెప్పాలి.

● భర్తకంటే చాలాపొట్టిగా ఉండే భార్య. హఠాత్తుగా ఆ మొగుడుగార్ని "ఏవండీ నేనుకూడా పొడుగ్గా ఉంటే బావుండేదని మీరెప్పుడైనా అనుకుంటారా" అని ఎప్పుడైనా అడిగే ప్రమాదముంది.

అప్పుడు ఆ భర్త "ఔనం"టే ఏం జరుగుతుందో మనందరికీ తెలుసు గనక అనకూడదు. కాదంటే ఆవిడ నమ్మదుగనక అలానూ అనకూడదు. అంచాత- "పొడుగమ్మాయి కావాలనుకుంటే అలాంటమ్మాయినే చేసుకునేవాణ్ణిగా. మరి నిన్ను చేసుకున్నది ఎందుకంటావ్...." వంటి బుజ్జగింపు/ సరసం నడపాలి — మనసులో మాట చెప్పకుండా!

● తిండి చూస్తేచాలు ఆవురావురుమని ఇంత నోటినిండా కుక్కుకుని— అలా నముల్తూ మాటాడ్డం లాంటి పనులు చేసే భర్తగారికి ఆ విషయాన్ని భార్య చెప్పచ్చా చెప్పకూడదా ?

కూడునా , కూడదా ? అలా ఉంచితే— ఆయనగారి వెకిలితనాన్ని అందరూ గుర్తించకముందే అరికట్టడం ఆమెకే మంచిది గనక చెప్పితీరుతుంది. ఎప్పుడు ? ఎలా ?

సరసంగా. సన్నిహితంగా ఉన్నప్పుడు చెప్తే ఆ సరసం కాస్తా విరసంబగున్!

పోసీ తగూలాడుకునేప్పుడే ఆ ముక్క కూడా విసరడానికి మొగుడంటే పొరుగింటావిడ కాదాయే! అంచేత— తామిద్దరూ చిలకా గోరింకల్లా ఉంటామని అతగాడు మురిసిపోమే సమయంలో ఇలాంటి విరామ సంగీతం కొట్టాలి.

● "వలచుట తెలిసిన నా మనసునకు మరచుట మాత్రము తెలియనిదా" అని ప్రేమించిన వాళ్ళు చాలామంది పాడేసుకుని మరో పార్ట్‌నర్ని వెదుక్కుని మళ్ళ



చెట్లమ్మటా పుట్లమ్మటా గూడ్స్ రైలు వాగన్లలోనూ తిరుగుతారు.

అలా తిరుగుతూండగా తనకో పాత ప్రేమకథ ఉందని (తననే ప్రాణంగా ప్రేమించే) అవతలి వ్యక్తికి తెలియజేయక పోవటం మోసం, ద్రోహం. దుర్మార్గం ఇంకాఇంకా తెలుగు సినిమా అయిపోతుందేమో అని బుద్ధిగా భావించవచ్చు! కానీ. ముందు ముందు తగువులూ గొడవలూ రాకుండా ముందుగా చెప్పి కొంప ముంచుకున్న వాళ్ళు చాలామందున్నారు.సినిమాలో మాదిరిగా ఎలా జీవించలేమో. అలాగే సినిమా పద్ధతిలో అపార్థాలూ. త్యాగాలూ కూడా ఉండవు ప్రేమికులారా!

● సంసార రథానికి రెండు చక్రాలుగా చెప్పబడుతున్న భార్యాభర్తల్లో ఏదో ఒక చక్రానికి—పదిమంది ముందూ రెండో చక్రం తాలూకు అలవాట్లనీ బలహీనతల్ని జోక్ చేసే అలవాటునాన్న.

ఏదో ఒక చక్రానికి — రెండో చక్రం చేతిలో డబ్బు పెత్తనం ఇరుక్కుపోయిందనిపించినా

ఇబ్బందిపడిన చక్రం రెండో చక్రానికి ఆ విషయాన్ని తెలియజేయవలసిందే! కానీ అప్పుడు తప్పనిసరిగా (పొరుగు రథాల వారికి తెలిసేంత కాకపోయినా) కొంత గొడవ తప్పదు. అంచాత మెటల్ రోడ్ల పైని కాక హైవేమీద పయనిస్తున్నప్పుడే ఈ ప్రస్తావన మంచిది.

అయినా ప్రేమించేవారికి ఏది చెప్పాలి— ఏది చెప్పకూడదు అనే ప్రశ్నవస్తే అసలు నిజాయితీగా ఉండటం అనేదికాదు సమస్య. ఎప్పుడు ? ఎలా ? ఎంతమేరకు ? అని!

కొన్ని నిజాలు చెప్పకపోవటంకూడా ప్రేమకు పునరంకితంకావడంగానే భావించాలికాని మోసం అనకూడదు.

**ఓ బాచిలర్ ఆఫ్ హార్ట్స్**

---

బిందూ.

........

బిందూ.

........

తల్లీ బిందూ!

ఆమె కళ్ళెత్తి చూసింది. కళ్ళు నిండిన కన్నీళ్ళు చెంపలమీదుగా జారిపోయాయి.

"తల్లీ! నిన్ను నేనిలా చూడలేనమ్మా. ఆపెయ్ తల్లీ—ఏడ్చి పసిపిన్నవయసులో బాధ పెట్టకమ్మా."

అతని కళ్ళల్లోకూడా తడి. ఆమె కళ్ల తుడుచుకుంది. తల విదిలించింది. ఐదు నిముషాల తర్వాత మెల్లిగా నవ్వింది.

ఆ నవ్వు - ఎవరో నవ్వమంటే నవ్వినట్టు. నవ్వకపోతే వీలులేనట్టు భరించలేనట్టుగా.... దయనీయంగా....

"బిందూ! అలా కాదు.. అలాకాదు తల్లీ మనస్ఫూర్తిగా నవ్వు."

ఈ సారి కాస్త శబ్దంచేస్తూ నవ్వింది హిమబిందు.

"పెద్ద మామయ్యా! నాకూ నవ్వాలనే వుంది కానీ. ఇప్పుడు కాదు. పావనిలాటి వాళ్ళను మీరంతా సమర్థించే రోజు ఒకరి సమాధుల మీద వాళ్ళ పునాదుల్ని తవ్వుకునే సాయిబాబాయి లాటి వాళ్ళను మీ పరిధి నుంచి బహిష్కరించిన రోజు ఆడపిల్ల అర్ధరాత్రి నిర్భయంగా నడచి వెళ్ళగలిగిన రోజు—

ఆ రోజు వస్తే నేను చనిపోకముందే అలాటి రోజు నాకు ఎదురవుతే-నా మనసు పరవశించి ప్రతిధ్వనించేలా నీ గుండె విచ్చుకునేలా నవ్వాలమంది మామయ్యా."

ఆమె మరలా వెక్కివెక్కి ఏడుస్తోంది. గుండెలు పగిలేలా ఏడుస్తోంది.

విరాయుధుడిలా. నిస్సహాయుడిలా వెర్రిగా. జాలిగా చూస్తున్నాడు బిందువంక అతను. ●